నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్ పనులు, కొత్త సర్వీసుల విడుదల చేపడుతున్నందున శుక్రవారం కోకాపేట, సీబీఐటీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ మణికంఠ తెలిపారు.

◆ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గోల్డన్‌మైల్, బాబుఖాన్ విల్లాస్, 250 లేఅవుట్, ఉదయ్‌నగర్, రెడ్డి బస్తీ, డీపీఆర్ అపార్ట్‌మెంట్, రాజపుష్ప, ఓపెన్ స్కై విల్లాస్, ఓషన్ పార్క్, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, ఫోర్ సీజన్ విల్లాస్, పావని విల్లాస్, లెజెండ్ చిమ్నీస్, కోకాపేట గ్రామం, రాజీవ్ గృహకల్ప, గ్రీన్ బ్లాస్సమ్స్ అపార్ట్‌మెంట్స్, ఈడెన్ గార్డన్, పోలోమి, అల్లురా నార్త్ స్టార్ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

◆ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐటీ, ఎంజీఐటీ కళాశాలలు, హాస్టల్‌లు, గండిపేట గ్రామం, శాంతినగర్, సబితానగర్, ట్రెజర్ ఐ ల్యాండ్, సీబీఐటీ ఎదురుగా ఉన్న ప్రాంతం, హైమా డెవలపర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను ఉండదని ఏఈ వివరించారు.

రేపు ఎంజీఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఇందులో పాల్గొంటారని సంబంధిత వర్గాలవారు తెలిపారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డెయిరీ రంగంలో ఉపాధి అవకాశాలు

గోల్కొండ: డెయిరీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎంజీపీ డెయిరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఈ రంగంలో సేవలు అందిస్తున్న సందర్భంగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఎండీ లైన్స్ చౌరస్తా వద్ద గల ఎంజీపీ ఔట్‌లెట్‌లో గురువారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంజీపీ డెయిరీ ప్రొడక్ట్స్ మేనేజర్ మహ్మద్ ఫజల్, మున్నా తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల ఉద్యమ నాయకుడు రాజు

గన్‌ఫౌండ్రీ: బలహీన వర్గాల ఉద్యమ నాయకుడు జేబీ.రాజు అని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. రవీంద్రభారతీలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళిత ఉద్యమ నాయకుడు డాక్టర్ జేబీ రాజు 85వ జన్మదిన అమృతోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి జేబీరాజు అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలు, జీవితకాల చరిత్రపై పుస్తకం రావాలని ఆకాంక్షించారు. అనంతరం జేబీ రాజు దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఆలపించిన సంగీతా విభావరి అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, శృతిలయ కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

అబిడ్స్: దారుసలాంలోని శివలింగ వినాయక రామ హనుమాన్ సాయిబాబా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోషామహల్ బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తంరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ అశోక్‌కుమార్, వైస్ చైర్మన్ జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ గౌడ్, ఇతర నాయకులు సురేశ్ గౌడ్, నర్సింహారెడ్డి, మహేశ్‌గౌడ్, జగన్, నందకిశోర్ అన్నదానం నిర్వహించారు. అలాగే ఆల పురుషోత్తంరావ్, కిషన్‌ను బీజేపీ నాయకులు, నిర్వాహకులు సత్కరించారు.

పనులు సరే.. మరమ్మతులెప్పుడో..?

మేకల మండి-కేసరి హనుమాన్ రోడ్డు అధ్వానం

జియాగూడ: జియాగూడ రహదారి అంటేనే వాహనదారులు జంకే పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు అభివృద్ధి పనుల కోసం తవ్విన రోడ్లకు అధికారులు తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును తవ్వే క్రమంలోనే సంబంధిత విభాగం మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేస్తుంది. ఆ తర్వాతే పనులు చేపట్టాలి. అయితే పనులు ముగిసిన తర్వాత తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టకుండానే వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మది దోచే చిత్రాలు

మాదాపూర్ అయ్యప్ప సొసైటీ అండర్ బ్రిడ్జి గోడలపై 16 ప్రాంతాల్లోని మార్కెట్ల చిత్రాలు





మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై కళాకారులు వేసిన చిత్రాలు



- సంస్కృతీసంప్రదాయాలతో కూడిన సందేశాత్మక చిత్రాలు
- భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి
- సామాజ సేవకుల జీవిత చిత్రాలు వేయాలి: కళాకారులు

మాదాపూర్: ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిల గోడలపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి చూపరులను ఆకట్టుకుంటున్నారు. మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్న అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిల గోడలు, పిల్లర్లపై కళాకారులు అందమైన చిత్రాలను వేసి చూపరుల హృదయాలను దోచుకుంటున్నారు. సుందరీకరణలో భాగంగా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలిపేలా బతుకమ్మ, పోతరాజులు, పేరిణి నాట్యాలతో పాటు మరిన్ని చిత్రాలను వేస్తున్నారు.

◆ మాదాపూర్ ప్రాంతం ఐటీ కంపెనీలకు నిలయంగా ఉండటంతో గోడలపై టెక్నాలజీని తెలిపేలా కళాకారులు చిత్రాలను వేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సామాజిక సేవలు అందించిన ప్రముఖుల చిత్రాలు అద్భుతంగా పిల్లర్లపై వేస్తున్నారు.

◆ అయ్యప్ప సొసైటీకి వెళ్లే అండర్ పాస్ బ్రిడ్జి గోడలపై జేఎన్ఏఎఫ్‌యూ విద్యార్థులు నగరంలోని ప్రధాన కూడళ్లు, మార్కెట్‌లను చిత్రరూపంలో పెయింటింగ్ వేస్తున్నారు. మోహింజా మార్కెట్, కోఠి, సుల్తాన్ బజార్ లాంటి 16 ప్రాంతాల్లోని వివిధ రకాల మార్కెట్‌ల చిత్రాలను వేస్తున్నట్టు కళాకారులు తెలిపారు.

◆ ప్రధాన కూడళ్లలో ఉన్న గోడలపై అర్థం లేని చిత్రాలను వేయడం కన్నా దేశ సంస్కృతి, సంప్రదాయలు, సమాజ సేవ చేసే ప్రముఖుల జీవిత చిత్రాలను తెలిపేలా వేయాలన్నారు. వేసిన చిత్రాలు భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో అర్థంలేని బొమ్మలను వేసి ఎలాంటి సందేశం లేకుండా చేస్తున్నారన్నారు. ప్రతి చిత్రం చూపరులకు సందేశాత్మకంగా ఉండాలన్నారు.

సందేశాత్మకంగా ఉండాలి



చాలా మంది చిన్నారులకు మార్కెట్, బజార్‌లు, ప్రముఖల పేర్లు తెలియదు. అలాంటి వారికి గోడలపై వేసిన చిత్రాల గురించి ప్రయాణ సమయంలో తల్లిదండ్రులు వివరించాలి. ప్రముఖులు చేసిన సామాజిక సేవల గూర్చి వివరించేలా వారి జీవిత చిత్రాలను వేసేలా అధికారులు ఆలోచించాలి. పలు చోట్ల జీవిత సత్యాలను తెలిపేలా కొటేషన్లు రాస్తే బాగుంటుంది.

– మురళీకృష్ణ, జేఎన్ఏఎఫ్‌యూ, ద్వితీయ సంవత్సరం

గోడలపై చాలా కష్టం



చిన్నచిన్న చిత్రాలు వేయడం కన్నా పెద్ద పెద్ద గోడలపై, మెట్రో పిల్లర్లపై చిత్రాలను వేయడం చాలా కష్టం, కచ్చితమైన కొలతలతో చిత్రం సైజును బట్టి లైన్స్ గీసుకుని చిత్రాలను గీయాలి. ఏకాగ్రత, చిత్రాలు గీయాలనే ఆసక్తి ఉన్నప్పుడే చిత్రాలు అద్భుతంగా వస్తాయి.

– శ్రీవల్లి, జేఎన్ఎఫ్‌యూ, ద్వితీయ సంవత్సరం

శరవేగంగా కార్వాన్ అభివృద్ధి



వివిధ సంఘాల నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర డివిజన్ల నుంచి పలు సంఘాల వారు మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిశారు ఈ సందర్భంగా పలువురు తాగునీరు, రోడ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలు డివిజన్లలో వరద నీటి పైపులైన్ల పనుల కోసం తవ్వకాలు చేపట్టారని, అవి పూర్తి కాగానే రోడ్డు మరమ్మతులు కూడా చేయిస్తానన్నారు. ఇళ్లల్లోకి వరద రాకుండా నిజాం కాలనీలో నూతన డ్రైనేజీ నిర్మించడమే కాకుండా టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో బాక్స్ డ్రైనేజీలు పనులు చేట్టామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

చాంద్రాయణగుట్ట: కేంద్ర మాజీమంత్రి టైగర్ నరేంద్ర స్మారక క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. బీజేపీ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో అలియాబాద్‌లోని పూల్‌బాగ్ చమాన్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన టోర్నీలో 16 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో గబ్బర్ సీసీ జట్టు గెలుపొందింది. గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర ట్రోఫీతో పాటు రూ.20 వేలు, రన్నరప్ జట్టుకు రూ.6 వేలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టీ ఉమా మహేంద్ర, ధర్మతేజ పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



అరుణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న మల్లారెడ్డి తదితరులు

అత్తాపూర్: బీజేపీకి యువతే కీలకమని యువతీయువకులంతా ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన హైదర్‌గూడ బూత్ నెంబర్ 228 డోనాల్డ్ చర్చి బూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నారెడ్డి అరుణ్‌యాదవ్, లాబార్థి ప్రముఖ్‌గా మల్లేష్ యాదవ్, సెక్రటరీగా కొంగళ్ల సాయి, వాట్సాప్ ప్రముఖ్‌గా పవన్‌యాదవ్‌లు నియమితులయ్యారు. వారిని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, నల్లింగ్ రమేష్, పుస్తకాల సుదర్శన్‌లు శాలువాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో మళ్లీ అత్తాపూర్ డివిజన్‌లో బీజేపీ జెండాను రెపరెపలాడించేలా యువత సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు ప్రముఖపాత్ర వహించాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శులు రావుల జగన్, సాయియాదవ్, కాకుళారం కృష్ణ, ఆటి రాజు, నాయకులు కె.మహేందర్, మోటే నరేష్, రాజేష్‌రెడ్డి, కృష్ణయాదవ్, రాజమణి, మౌనిక, స్వప్న, లక్ష్మీబాయి, సచిన్, హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు

రాజేంద్రనగర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు కామ్రేడ్ పుస్తకాల నర్సింగ్ రావు, మైలార్‌దేవ్‌పల్లి చౌరస్తాలో రాష్ట్ర మున్సిపల్ సంఘం యూనియన్ కార్యదర్శి కామ్రేడ్ వనంపల్లి జైపాల్‌రెడ్డి, రాజేంద్రనగర్ చౌరస్తాలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.ఎ.రియాజ్ జెండాలను ఆవిష్కరించారు. రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం యూనియన్ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ జె.ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె.విజయానంద్ గౌడ్, బీసీ సంఘం జిల్లా నాయకులు జె.సదానందం గౌడ్, గండిపేట్ మండలం కార్యదర్శి స్వామి, పార్టీ కార్యాలయ కార్యదర్శి సత్యనారాయణ, పాండు, బండి, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర బాల దివస్

అత్తాపూర్: అత్తాపూర్ నౌ నెంబర్ గురుద్వార్‌లో వీర బాల దివస్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డిలు గురుద్వార్ తదితరులు ఇస్లాం మతోన్మాదానికి బలైన అమరవీరులకు నివాళులు అర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కొముర‌య్య, సాబాద విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వీర బాల దివస్‌లో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

త్వరలో పార్కును ప్రారంభిస్తాం

మణికొండ: ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదంగా ఉండేందుకు పార్కులు ఎంతో ఉపయోగపడతాయని, 9వ వార్డులో అభివృద్ధి చేసిన పార్కును త్వరలోనే ప్రారంభిస్తామని కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్ అన్నారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న పార్కు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అరుణోదయ కాలనీలో ఉన్న పార్కు స్థలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ఇందులో వాకింగ్ ట్రాక్, యోగా వేదిక, పిల్లలకు ప్లే ఏరియా, ఓపెన్ జిమ్‌లతో పాటు పచ్చిక బయళ్లు ఉన్నాయన్నారు. నార్సింగి గ్రామస్థులతో పాటు అరుణోదయ కాలనీ, ఆనంద పొయెట్రీ గేటెడ్ కమ్యూనిటీల వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. పార్కును ప్రజలంతా ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. స్థానిక నేత వినోద్ తదితరులు పాల్గొన్నారు.



పార్కు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక

కేంద్ర మంత్రికి సత్కారం



కేంద్ర మంత్రి సింగ్ బాగాల్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

రాజేంద్రనగర్: నగరంలో జరిగిన సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాగాల్‌ను గురువారం ఉదయం రాజేంద్రనగర్‌లో బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ కమిటీ కన్వీనర్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, నేతలు కొమురయ్య, జగన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణ పనులకు భూమి పూజ

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం పునఃనిర్మాణ పనులను దాత అల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లం కృష్ణ, అల్లం భాస్కర్, అల్లం ఆదిత్య, అల్లం సిద్ధు, రాకేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దంత వైద్యుడి నియామకం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న దంత వైద్యుడి పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. కొన్ని నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడి దంత వైద్యులు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. అయితే ఇటీవలే డాక్టర్ రాకేశ్‌కుమార్ బదిలీపై వచ్చారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. దీంతో ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నట్లు అయ్యిందని పేర్కొన్నారు.

కళాతోరణంలో విరాట్ భక్తి సత్సంగ్ షురూ

నాంపల్లి: తెలుగు లలిత కళాతోరణంలో పరమ పూజ్య సుధాన్షు జీ మహారాజ్ సత్సంగ్ గురువారం రాత్రి ప్రారంభమయ్యింది. నాలుగు రోజుల పాటు ఇవి కొనసాగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, మెడిటేషన్, భజన కార్యక్రమాలు ఉంటాయి. మాజీ ఎమ్మెల్యే, విశ్వ జాగృతి మిషన్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ రాథోడ్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ నెల 29న ఆదివారం ఉదయం 11 గంటలకు గురు మంత్ర దీక్ష ఉంటుంది. మొదటి రోజు వర్షం కారణంగా అరగంట ఆలస్యంగా ప్రారంభించి అరగంట ముందే ముగించారు.

స్తంభాలు వేసి.. లైట్లు మరిచారు!



సూర్యనగర్ కాలనీలో బల్బులేని విద్యుత్ స్తంభం

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ సూర్యనగర్ కాలనీలో కొంత కాలం క్రితం అధికారులు కొత్తగా 40 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే వాటికి బల్బులు పెట్టకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఈ విషయమమై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అదే కాలనీకి చెందిన మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లు అమర్చాలని ఆయనతో పాటు స్థానికులు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ

మణికొండ: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీల ప్రజావ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలినగర్ కాలనీలో పార్టీ మండల స్థాయి మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ పెట్టుబడి దారులకు వత్తాసు పలుకుతుందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాల్సిన బాధ్యతను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయటంలో తాత్సారం చేస్తుందన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనతో విసిగి కాంగ్రెస్ పాలనలో తమకు న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్మి గెలిపించారన్నారు.



నెమలినగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మండల కమిటీ ఎన్నిక...

సీపీఎం గండిపేట మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా డి.ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా ఎం.అశోక్, మహిపాల్ యాదవ్, యాదగిరి, సుభాష్, భారతమ్మ, నాగేష్‌గౌడ్, బి.బాలరాజు, కె. రాజుగౌడ్‌లను ఎన్నుకన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల డివిజన్ జిల్లా కమిటీ సభ్యుడు దేవేందర్, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు సిఖ్ చావునీలోని గురు నానక్ హై స్కూల్ గ్రౌండ్‌లో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర చారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్‌కుమార్, కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శులు బోయ లక్ష్మణ్, వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, విశ్రాంత ఎస్పీ ప్రీతం సింగ్‌లు ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలతో పాటు క్యారమ్స్, చెస్, స్పెల్ బీ, అథ్లెటిక్స్, షాట్‌పట్, మోనో యాక్షన్, వక్తృత్వ పోటీలు, కబడ్డీ పోటీలను నిర్వహిస్తామన్నారు. బాల బాలికలకు విడి విడిగా పోటీలు ఉంటాయన్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు హైదరాబాద్ స్కాట్స్ స్కూల్‌లో నిర్వహించనుండగా... మిగతా పోటీలన్నీ గురు నానక్ హై స్కూల్‌లో నిర్వహిస్తామన్నారు. రాజేంద్రనగర్ మండలంలో ఉన్న గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల నుంచి 4000 మంది విద్యార్థినీవిద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని వారు వివరించారు.

కేలండర్ ఆవిష్కరణ

మైలార్‌దేవ్‌పల్లి: హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో బీర లింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో హెచ్‌పీకేఎస్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. సంఘం వ్యవస్థాపకుడు కొల్లంపల్లి శ్రీనివాస్ కురువ, జిల్లా అధ్యక్షుడు మాదారం కృష్ణ కురువ, జంట నగరాల అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ కురువ, నేతలు ఆనంద్, కోస్గి హనుమంతు కురువ, బాన్యనోల రామచందర్ కురువ, జేట్రం శ్రీనివాస్ కురువ, కాంతల అశోక్ కురువ, అప్ప శ్రీను కురువ తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం

శేరిలింగంపల్లి: బాడ్మింటన్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారుడిని భెల్ ఉద్యోగులు సన్మానించారు. గురువారం శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో ఉగాండ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్, ఈజిప్ట్ ఇంటర్నేషనల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే ఈ నెల 21 తేదీన బంగ్లాదేశ్‌లో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడంతో భెల్ ఉద్యోగులు, కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నవనీత్ తల్లిదండ్రులు అనంత, బి.ఎస్.శ్రీనివాస్‌తోపాటు డాక్టర్ వి.ఉమామహేశ్వరరావు, అశ్వినికుమార్, శ్రీనివాస్, సాంబశివుడు, గుత్తుల వెంకటేశ్వరరావు, గుత్తుల గోపాలకృష్ణ, సూర్య, అర్జున్‌రావు, నాగేశ్వరావు, మునీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



నవనీత్‌ను సన్మానిస్తున్న భెల్ ఉద్యోగులు